# బాలు బాలు ఓటొక్కటి

ర.వ.న.

## మిట్ట మధ్యాహ్న వేళ!

పెనం మీద మాడుతున్న రొట్టె ముక్కలా నల్లటి తారు రోడ్డు సలసల కాగుతూంది! పశు పక్ష్యాదులు సైతం గూళ్ళు విడిచి ఇవతలికి రావటానికి జంకుతున్నాయి!

అచ్చంపేట బస్టాండు జనంతో కిటకిట లాడుతూంది! వచ్చే పొయ్యే బస్సులతో తెరిపి లేకుండా ఉంది! అయినా జనం మాత్రం తగ్గటం లేదు!

బస్టాండు ఎదురుగా ఉన్న చింతచెట్టు కింద కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు గంగులు! చేతిలో పని లేకపోతే గంగులికి అది మామూలే! అతని కళ్ళు మాత్రం రోడ్డుమీద కదిలి పోతూ ఉండే పాదాల్ని పరిశీలిస్తుంటాయి! ఇప్పుడూ అదే పని చేస్తున్నాయి.

గంగులు ఆ చింత చెట్టుని పాతికేళ్ళ నుంచీ ఆశ్రయించి ఉన్నాడు! తండ్రి మిగిల్చి పోయింది ఒక పూరి పాకా, రెండు వేలు అప్పూ! ఆ వూరు షావుకారు పాకను జప్తు చేసుకోవటంతో పదేళ్ళ క్రితమే ఋణ సమస్య పరిష్కారమై పోయింది గంగులుకి! అప్పటి నుంచీ అద్దె పాకలో కాపర ముంటున్నాడు!


అచ్చంపేట మరీ పల్లె కాదు—మునిసిపాలిటీ స్థాయికి చేరుకోదగిన టవునూ కాదు! కాని బస్సులకు, లారీలకు కూడలిస్థానం! అందుచేత బస్టాండు ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది! గంగులు రోజుకు పదహారు గంటలు ఆ చింత చెట్టు కిందే పొట్ట కోసం తాపత్రయం పడుతుంటాడు!

రోడ్డుమీది ఎండ లాగే గంగులు కడుపూ మాడుతూంది!

"గీ చంద్రిగాడు ఇయ్యాల బువ్వ తీస్కు రాలే ఇంకా. ఏ వ్కేం రోగ మొచ్చిందో?" అనుకున్నాడు గంగులు ఆలోచనల మధ్యన.

అంతలో అతని దృష్టి ఒక పాతికేళ్ళ కుర్రాడి మీద పడ్డది! ఆ కుర్రాడు వాహనాల మీద ఏవో కాగితాలు అంటిస్తున్నాడు.






గంగులు మరకాస్త పరికించి చూశాడు కుర్రాణ్ణి! అనుకోకుండానే అతనిలో ఉత్సాహం పెల్లుబికింది. లేచి వడివడిగా ఆ కుర్రాడి దగ్గిరికి వెళ్ళాడు గంగులు!

ఆ కుర్రాడు గంగులును చూసి నవ్వుతూ—

"ఏం గంగులు మావా, బాగున్నవా?" అని అడిగాడు.

"ఆఁ,ఆఁ.బాగనే ఉన్నా కానీ,నువ్వెప్పుడొచ్చినవురా వూళ్ళెకు? కొల్వొయిందా?" అడిగాడు గంగులు.

"ఆఁ. ఏడ్కొల్లి ఐతది? బి. ఏ. చదివినగూడ ఏం లాభం లేకుంటయింది. పట్నంల కొల్వు కోసం తిరిగి తిరిగి బేజారయి వూరి కొచ్చినా! తీస్క పోయిన పైసలన్నీ ఒడిసినై గాని కొల్వు రాకపాయె. నీ పనే మంచిగున్నది. హాయిగా నేనుగూడ నీపక్కకే జేరి చెప్పులు కుడ్తమనుకుంటన్న" అంటూ ఇంకా ఏదో చెప్పబోతున్న మైసయ్యను వారిస్తూ—

"గనేం మాటల్రా, మైసిగా? సదువుకున్నోడివి నువ్వే గిట్ల అధైర్యంపడ్తె ఇగ మా గతేం కావాలె?" అంటూ మెత్తగా మందలించాడు గంగులు!

"కాకపోతే మరేందే—కూడు బెట్టని ఈ డిగ్రీ లేమిట్కి, గీచదువులేమిట్కి?"అంటున్న మైసయ్య దృష్టి అప్పుడే అక్కడి కొచ్చి ఆగిన ఒక లారీమీద పట్టంతో పోస్టరు తీసుకుని పరుగెత్తాడు.

"ఏందీ పోరడు గిట్లయిండు? నర్సిగాడు ఈన్ని ఎన్ని కష్టాలు పడి సదివి పిచ్చిండు పట్నంల! అయినా పాసం గంత సదువు సదవికోన్కి కొల్వు ఏమిట్కి రాలేదో? మొత్తంమీద మనమే తెలివి కలోల్ల మైనట్టుంది. అనవసరంగా బళ్ళెకు తోలి పోరన్ని పనికిరాకుంట చేసిండు. మా చంద్రిగాడే నయం. నా సరింగ బజార్ల కూకోని నాలుగు రాల్లయినా సంపాయిస్తుండు" అని తనలో తనే గొణుక్కున్నాడు గంగులు.

ఇంతలో మైసయ్య మళ్ళీ అక్కడి కొచ్చాడు.

"అది సరేగానీ, మైసిగా, అప్పట్నుంది చూస్తున్న ఏందో కాగితాలు అంట బెడ్తున్నవు మోటర్ల మీద. ఏదన్నా బాగోతులున్నయ్యా మనూళ్ళె?" అడిగాడు గంగులు.

"భాగోతులు కాదే! ఇంకో రెన్నెళ్లల్ల రామలింగం, రంగన్న లిద్దరి మధ్యన గసుంటిదే ఉంది" అన్నాడు మైసయ్య.

"ఆహా! ఐతే మల్లొచ్చినాయ్ ఎలచ్చన్లు! ఇగైతే రామలింగం మల్ల రంగంలోకి దూకుతడంటవు?" ఆరా తీస్తున్నట్టుగా అడిగాడు గంగులు.

ఆ మాటలకు మైసయ్య ఆశ్చర్యం ప్రదర్శిస్తూ.

"గదేంది అట్లడుగుతవూ! వాళ్ళ నాయన చచ్చిందంక ఏలలే? ఆయన పోత పోత గీనకు చెప్పి పాయె! మరిగ ఈనగూడ చచ్చిందంక కుర్చీ ఇడుస్తె ఎట్లా? వాళ్ల ఆచారానికి పనికి రావద్దా?" అంటూ అక్కడికి కొచ్చిన మరో బస్సు వైపు పరుగు తీశాడు.

"ఐతే మల్ల సంత మొదలయిత దన్న మాట" అనుకున్నాడు గంగులు!

ఇంతలో—

"అయ్యా! ఏందే గాడ నిలబడ్డవు? బువ్వ తెచ్చినా! తొందరగ రా!" అంటూ చంద్రయ్య కేక బెట్టాడు రోడ్డవతలి నుంచి!

"నే నేడ నిలబడ్తె నీ కెందుగ్గాని, ఏందిరా, చంద్రిగా, ఇంత పొద్దు పోయిం దియ్యాల?" చిరుకోపం ధ్వనించింది గంగులు గొంతులో.

"నువ్వట్ల కోప్పడకే, అయ్యా! ఇయ్యాల అమ్మ చేప పులుసు చేసింది. నిన్న పట్టుకొస్తి గదా నాచారం చెరువుల" అంటూ చిరునవ్వు నవ్వుతూ చతికిల బడ్డాడు చంద్రయ్య!

"చేపలు నువ్వు పట్టుకొస్తుంటవు, మీ యమ్మ పుల్సు కాస్తుంటది. వోసి నీ ఎంత బాగున్నది రా? నీ కెన్ని సార్లు చెప్పినా చెరువు కాడికి పోవద్దని!" కోపంగా అన్నాడు గంగులు.

"ఏమిట్కి, అయ్యా, గట్ల కోప్పడ్తవు? అయిగ పుల్సు చేసుకుని తింటే ఎంత కమ్మగుంటది?" లొట్ట లేస్తూ అన్నాడు చంద్రయ్య.

"ఉంటదిరా! కమ్మంగనే ఉంటది! నువ్వు పనికి ఎగనామం బెట్టి చెరువు కాడ చాపలు పట్టుండు—మీ యమ్మ నీకు పుల్సు కాసి బువ్వ పెట్టుంటది. ఈ ముసలి కాలాన నే నింకా మిమ్ముల్ను మేపుకుంట గీ రోడ్డు మీదనే పడుంట."

చంద్రం బాధ్యత మరిచి ప్రవర్తిస్తున్నాడనే ఆవేదన వ్యక్తమైంది గంగులు గొంతులో.

"సరే. ఇగ పోనుగా! నువ్వు బువ్వ తిను.. మల్ల సల్లగయితది. నువ్వు రెండు బుక్కలు తిని జరసేపు పండుకో. నేను కూకుంట దుక్నం మీద!" వినయంగా అన్నాడు చంద్రయ్య.

• • • •

"దండాలు, దొరా!"

భవంతి ముందు పచ్చికలో దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చున్న రామలింగం తలెత్తి చూశాడు.

చేతులు జోడించి, వినయంగా వంగి ఎదురుగా గంగులు కనపడ్డాడు.

చటుక్కున ముఖం పక్కకు తిప్పేసుకున్నాడు రామలింగం!

"దొరవారు కబురు చేసిండంట." మరింత వంగిపోయి అడిగాడు గంగులు!

"అవున్నా—కబురు బెట్టినా! బిడ్డా, మీరు వంగి వంగి సలాములు చేసుకుంటనే మా చాపల కిందికి నీల్లు తెచ్చే టట్టున్రు!" రామలింగం తిరక్కుండానే అన్నాడు.

స్వామి వారికి ఏమిటో, బాగనే కోప మొచ్చిం దనుకున్నాడు గంగులు.

పైకి మాత్రం ఏం మాట్లాడకుండా అలాగే నిలుచున్నాడు.

అలా ఒక రెండు నిమిషాలు దొర్లిపోయాయి నిశ్శబ్దంగానే!

"సంగతి చెప్పండి, దొరా!" అన్నాడు గంగులు నిశ్శబ్దాన్ని చేదిస్తూ.

సర్రున రామలింగం గంగులు వైపు తిరిగి—

"ఏందిరా మీ వోల్లందరూ నిన్న రంగన్నగాని మీటింగుకు పోయిండ్రంట. మునసబు చెప్పిండు" అన్నాడు.

దొరికి పోయిన దొంగలా కాస్త ఇబ్బంది పడుతూ—

"అవ్వయ్యా! ఏదో మీటింగుందంటని చెప్తె మా గూడెమోల్లందరం పోయినం!" భయం భయంగా అన్నాడు గంగులు.

"ఆడేం చెప్పిండు మీటింగుల?" అసహనంగా అడిగాడు రామలింగం!

"ఆయనేం చెప్తడూ! మొన్న మీరు మీటింగుల చెప్పిన వన్నీ చెప్పిండు! ఇంకా." అని ఆగాడు గంగులు!

"ఆ. ఇంకా? ఇంకా ఏం చెప్పిండ్రా?" ఆదుర్దాగా అడిగాడు రామలింగం!

"అదే, దొరా! నాలుగేండ్ల నాడు చెరువు కట్ట తెగి మా పల్లెంతా కొట్క పాయెగా! మల్లందరూ కొత్తంగ గుడిసె లేసుకొంటిరి యాదాది నాడు! మొంగిన ఈ తాప ఆయనకు వోటేసి గెలిపిస్తె మా గూడెమోల్లందరికీ వూళ్ళెనే పక్కా ఇండ్లు కట్టిపిస్తనన్నడు! సర్కారు ఆస్పత్రిల పైసల్లేసుకో కుంట పున్యానికి మందులిచ్చే డాక్టర్లన్న తెప్పిస్తనన్నడు! మా పొలాల్లబావులు తొవ్విపిస్తనన్నడు, చెప్పుకు పోతున్న గంగులు వైపు అసహనంగా

చూస్తూ కోపంతో—

"ఆగి పొండి చేస్తడు! ఆడు చెప్పేవన్నీ చెయ్యా లంటే మాటలొత్తని గలదా? ప్రజా సేవ చేయటం మా వంశాని కేం కొత్తగాదు! ఆట్లా సుంటిది సేసే చెయ్యలేక చస్తుంటే ఈ డియ్యాలొచ్చి మేం గది చేస్తా, గిది చేస్తా సంటే వన్నిక్కేం ఎర్రి పుట్టేవ దంటనా వోటెయ్యనికి" వ్యంగ్యంగా అన్నాడు రామలింగం!

"ఏమో, దొరా! ఆ రంగన్న చెప్పేట్వన్నీ చేస్తడో, చెయ్యడో నా కెర్క లేదు కానీ, మీరు చెయ్యలేని పన్లే చేస్త నంటుండు! ఇంకా మీదెర్లిన్ల తన రెండెకరాల తరి గూడెపోల్లకు ఇచ్చేసిండు! ఇగ ఆన్ల పండే పంటంతా మేమే తీసుకోవాల్నంట సమానంగా! ఇంకా ఏం దేంటొ చెప్పిండు దొరా" అన్నాడు గంగులు.

"అరే,పిచ్చోడా, ఆడు చెప్పేవన్నీ నమ్ముతున్నావురా? ఆడేం చెస్తడు బీదోల్లకు? బీదోల్లకు ఏమన్నా చేస్తే నేనే చెయ్యాలె! నే నేం చేస్తే అది మీరు చేయించు కోవాలె! అంతేకాని ఆడెవడో మధ్యలొచ్చి నేను చేస్త మీరు చేయించు కొనండనంటే మరిగ నేనేమిట్కి? నే నేమై పోవాలె? "కోపంతో పళ్ళు పటపట కొరుకుతూ అన్నాడు రామలింగం.

గంగులు అమాయకంగా చూస్తూ—

"అవు,దొరా! అదీ పాయింటే! అప్పటికే నేనూ మా కుల పెద్దోల్లం కొంతమందిమీ అన్నం—ఏం చేసినా చెయ్యకె పోయినా రామలింగం దొరనే ఏటివి వుండాలె గానీ నువ్వు ఇయ్యాలొచ్చి వూరు బాగు చేస్తనంటవేంది?' అని అడిగినం!"

"వోరి నీ యమ్మ! ఏం అడిగ్గిరా? భలే అడిగింరు ఏమన్నడాడు?" ఆత్రంగా ప్రశ్నించాడు రామలింగం!


"అట్లగాదన్నడు, దొరా! మన బతుకులు బాగు పడాల్నంటే వో టొక్కటే దిక్కన్నడు దొరా! ఒక్కసారి ఏసిన వోటు ఐదేండ్ల ఏన బ…లు చెప్తదన్నడు, దొరా! అందుకే బుద్ధి తెచ్చుకుని, ఆలోచన చేసి వోటెయ్యాలని చెప్పిండు! ఇంకా ఏందేందో చెప్పిండు గాని, నాకెరకైంది ఇంతనే. కాని మా చంద్రిగాడూ, మైసిగాడూ ఆయన వెన్క బాగ తిరుగుతున్నారు! గామాట కొస్తే పోరల గుంపంతా ఆయన దిక్కే మొగ్గుతున్నది." నింపాదిగా వివరించాడు పరిస్థితి గంగులు!

గంగులు వాళ్ళ జాతికి జ్ఞానోదయంతో పాటు భవిష్యత్తు మీద ఆలోచనలు ప్రగతి పథంలోకి మలుపు తిరుగుతుండటం దృశ్యంగా కనపడింది రామలింగానికి.

రామలింగం ఆలోచనలో పడ్డాడు మళ్ళీ.

ఇక ఉపేక్షిస్తే తల బొప్పి కట్టటం ఖాయమనిపించింది. దాంతో మనిషి నిలువునా కుంగిపోయాడు! అధికార పీఠాన్ని ఆవగింజంత వాసిలో రంగన్న తన్నుకు పోతున్నట్టనిపించింది. అలా జరిగితే తన వంశానికే మచ్చ! ఎలాగైనా ఆ మచ్చ రాకుండా కాపాడుకోవటమే తక్షణ కర్తవ్యం! నిజంగా అలా జరిగితే! అమ్మో! సాటి నాయకుల్లో తన పరువేం కానూ! వాళ్ళ మధ్య తలెత్తుకు ఎలా తిరగ్గలడు! అందుకే బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు.

"నేను మీకు ఏం చేసినంటనే గదా మీ రడిగేది ?




అవ్వన్నా—నేను మీ కేం చెయ్యలె! ఒప్పుకుంటున్న గదా! ఇగ చేస్త సూడున్రి! గా రంగన్న చేస్తనన్న పన్లన్నింటి కన్నా ఒక టెక్కువనే చేస్త గాని తక్కువ గాదు! నువ్వు మా గూడెంకు గుండెకాయవు కదరా, గంగులూ. నువ్వు గీసిన గీటు దాటే కలేజా ల్లేవు ఎవనికీ! పోయిన తాపనే చావు తప్పి కన్ను లొట్ట పోయినట్టు నెగ్గితి! నన్ను ఎట్లనన్నా చేసి ఈ సారికి ఒడ్డెక్కించరా, గంగులూ! నీ కెంత పైస కావాల్నన్నా ఇస్తా! గీ ఒక్కసారి సాయం చేసి పున్నెం గట్టుకో! ఆ తరవాత నేను ఏం చెయ్యకపోతే ఇగ మల్ల నా ముఖం చూడకు!" నిర్లజ్జై, ధైర్యం పూర్తిగా కోల్పోయి ప్రాదేయ పడ్డాడు రామలింగం!

ఎలాగైనా రామలింగం పరిచిన వలలో చిక్కుకోవటం ఇష్టం లేక—

"దొరా! నే నొక్కడ్ని మీ తోటి ఏం మాట్లాడ్త! ఐనా, మీ రంటే మా కే నాడు యిస్వాసం లేదు? మా తాతల తాతలు గూడ మీ ఇండ్లల్ల వూడిగం చేసినోల్లమే నైతిమి! మీరు పేదోల్లకు ఎంత చేసేద్ది మాకు కొత్త గాదు! మీరు పైసలు కర్సు పెట్టరని కాదు—మా రాజులు—మీ కేంది, దొరా! కొండమీది కోతే దిగొస్తది మీతానికి! కాని నే నొక్కన్ని ఇప్పుడిప్పుడు ఏం చెప్పజాల్త! ఇంటికి పోయి, గూడెంల నలుగురూ పెద్ద మనుసులను అరుసుకుని వాళ్ళ మాట గూడ ఇంటా! చెరువు కాడికి గుర్రాన్నంటే తోల్కపోతం గాని, అది నీల్లు తాగనంటే మన మేం చెయ్యజాల్తం! గీమాటలు మీకు నేను చెప్పే పాటోన్నా? మల్ల కలుస్తా, దొరా! అప్పుడే ఏడ, ఇంక పద్దినా లున్నయి కదా ఈ సంబరాలు" అంటూ వెనక్కి మళ్ళాడు గంగులు!

● ● ● ●

ఎన్నికల ప్రచార ఘట్టం పూర్తయింది.

తెల్లవారితే ఎన్నికలనగా గంగులు తమ గూడెం లోని జనాన్నందర్నీ రమ్మని కబురు చేశాడు!

సాయంత్రం ఆరు గంటల కల్లా గూడెం జనం పోగయినారు వూరికి దక్షిణా నున్న పచ్చిక మైదానంలో.

అందరికన్నా ముందుగా సోమయ్య లేచి నిలబడి—

"అరేయ్, గంగులూ! ఏంటికిరా ఇయ్యాలీ మీటింగు? నీ యమ్మ! రెండు నెల్ల నుంచీ మీటింగు లనీ ఇనీ చెవులు తూట్లు పడుతున్నయి గదా! మల్ల నువ్వు మీటింగు పెట్టిన వేంది?" అన్నాడు విసుగు ప్రదర్శిస్తూ.

"గదేనే, పెదనాయనా! తెల్లారితే మనందరం వోట్లెయ్యాలె గదా! మరి మన గూడెపోల్లమంతా ఒక్క మాటమీద నిలబడి, కట్టుబడి ఉండాలె గదా! అందుకోసం అసలు మనోల్లు ఏమనుకుంటున్రో తెలుసుకుందామంటని ఈ మీటింగు పెట్టినా!" సందేహ నివృత్తి చేస్తున్నట్టుగా వివరించాడు గంగులు.

"ఆ. ఇగ మళ్ళ అనుకునే దేంది? ఇయ్యాలేం కొత్తంగ ఏస్తున్నమా వోట్లు? ఎప్పు డేసినట్టే మన రామలింగం దొరకే మన వోటు!"

"అరేయ్! రామలింగం దొరకూ..." అంటూ జనం వైపు తిరిగి అరిచాడు.

వెనక వరసలో కూర్చున్న కొంతమంది ముసలి వాళ్ళు—

"మా వోటు..." అంటూ నీరసంగా బదులిచ్చారు.

గంగులు సోముల్ని సమీపించి—

"అది గాదే! మనం ఎప్పటి సందో రామలింగం దిక్కుండి ఆయనను గెలిపించినం! ఆయన మనకేం జేసిండు! అంతెందుకు? పది యేవేండ్ల నాడు నీ తాన ఏంతుండె? ఇయ్యాలేముంది? గదే మరి ఆయన్ను సూడు. ఎట్ల కొండ లెక్కుతుండో! మన కష్టం తినుకుంట, రక్తం తాగుతున్నోన్ని గెలిపించి ఆయన్నే దేము దంటున్నం మనం ఇయ్యాలటిదాంకా! మన లెక్కనే రంగన్న గూడ పేదోడు! పేదోని కష్టాలు పేదోన్కే ఎర్కయితయి! అసలు కష్టమంటే ఏందో తెల్వనోన్కి ఇంకోని కష్టమేం అర్తమైతది?" ఆవేశంతో చెప్పాడు గంగులు.

"అవురో! గది గొడ పాయింటే! మరైతే మన వోటు రంగన్న కేద్దా మంటవా? నీతల్లి ... నేనైతే తయారున్నా! పోనీ గీపారి రంగన్న కేస్త

ఏం జేస్తడో గది గొడవ గాద్దం!'' అన్నాడు సోములు ఉత్సాహంగా!

''మరి నువ్వేమంటవే, తాతా?'' ప్రశ్నించాడు గంగులు!

తాత మెల్లిగా లేచి నిలబడి—

''నే నేమంటరా, మన్మడా! నువ్వెట్లంటే నే నట్లంటా! గీరామలింగానికి వోసారి బుద్ది సెప్తేనే బాగుంటది, ఏమో, మాలావు నీలుగుతుండు'' అని కూర్చున్నాడు.

''అవ్వే, మావా...ఎప్పట్కే వోట్లప్పుడు కడుపు నిండ కల్లు తాపి ఎక్కసిరి గంజి ఏగురిస్తడు! అందుకే ఈ పెద్దాయనకు ఈపాలి జర గట్టెంగనే బుద్ది చెప్పాలె'' అన్నాడు కిష్టిగాడు.

''పోయినేడు మా పోరి పెండ్లి చేతామంటని పైన అడిగితే — నీ యమ్మ ఇచ్చినట్టే ఇచ్చి మొన్న నా రెండు కుంటల తరి నూకిండు! ఇక ఆనికి నేను సచ్చినా వోటేస్త నంటవా? గీ బోంది బ పాన ముండగ కాదది!'' ఖండితంగా చెప్పాడు నర్సిగాడు.

''అది సరేగానీ ... మీ రందరూ రామలింగం దొరకు వోటెయ్య నంటున్రు గదా — మరాయన ఈ తాప నెగ్గిండంటే మన పొలాలు మన కిచ్చేస్త నంటుండు, ఇంకా ... బాకీలన్నీ మాపు చేస్త నంటుండు. మరిగ దానికి మీ రేమంటరూ?'' అన్యాపదేశంగా అన్నాడు గంగులు!

''ఆయనెన్నడన్నా చెప్పింది చేసిన్రా,గంగులూ? అది అని వంశంలనే లేదు! ఇయ్యాల కొత్తంగ ఏడ్కెల్లి వస్తది? గీవన్నీ మాయమాటలు, బిడ్డా!'' తాత వోపిక తెచ్చుకుని మరీ అన్నాడు!

''అవ్వే, మావా... ఆయన మాటలు ఇనీ ఇనీ మనం మనుసుల మనే సంగతే మర్సిపోతిమి ఇన్ని దినాలు! ఇంకా ఆయన మాట లినేదేంది— తాత అన్నట్టు ఆయన మనకు చేసిందేం లేదు. ఐనా నాకు తెల్వక అడుగుతున్నా— నువ్వేంది ఆయన్ను ఎన్కేసు కొస్తున్నవ్?'' అనుమానంగా అడిగాడు కిష్టిగాడు!

ఆ మాటకు గంగులు కాస్త చలించిపోయి—

''అరేయ్, కిష్టిగా, ఆయనకు నేనేం ఎన్కేసు కొస్తలేనురా! మీరేమనుకుంటున్రో తెలుసు కుందమంటని సిన్న సురకేసినా! మీ పట్టుదల లేపాటియో తెల్సిపాయె, గంతే!'' అన్నాడు గంగులు!

''నే వస లీ పద్దతినే ఖతం చెయ్యాల్నంట! రామలింగమేందీ, రంగన్నేందీ—వీల్లెవ్వరూ మన గతి పట్టించుకోరు! మన బతుకు అల్ల మన్నుబోసే గీపద్దతే మంచిది గాదంట నేను! నీయమ్మ ... మీ కెంత వోపిక పొడైందిరా గులాంగిరీ చెయ్యనికె! మనందరం కల్సి ఐక్కపారి ఉంచిన మంటే గీవోట్లడిగే కొడుకులు కొట్కపోతరు! నేను పోయిన తాపనే చూసిన పేపర్ల — ఆడేడనో షురూచేసిం రంట—గావూర్ల అసలు ఎవ్వరూ వోటే ఎయ్యలే దంట! మనం గొడ గట్లనే చేస్తే ఏమైతది? మనం నోరు మూసుకొని బతికినన్ని దినాలు గిట్ల సచ్చు కుంట బత్కాల్నా! థూ— ఏం మొండి బతుకులే మనంయి'' అంటూ కాండ్రించి ఉమ్మేశాడు నరసింగ రావు.

''అబ్బ! ఎంతదూరం ఆలోచన చేసినావురా?




నువ్వన్నట్లు వోట్లకు ఎగనామం పెట్టే రాజ్యం గాదురా మనది— ఆ రాజ్యాలు అలగున్నయి! మన మటు పోతలేం! మన తాన వోట్లున్నప్పుడు మనం ఎందుకు ఎగ్గొట్టాలె! అదీగాక ఏడ్నో వోతాన గట్ల చేస్తే ఏమైతది?మన పద్దతిల మనం పోవాలె— అంతేగాని ఆ డెవడో చేసిండంటని మనం గూడ చేద్దమంటే గదేం మర్యాద? చెరువు మీదల్గి సిమో చేసిండంట ఎక్కటికోడు ... గట్లుంటది'' అంటూ నచ్చచెప్పాడు గంగులు!

''చ ... మీ వోట్లకు మీకూ వో దండం! నే నే కొడుక్కీ ఎయ్య వోటు —ఎవడేం జేస్తడో చూస్త'' అంటూ చరచరా అక్కడి నుండి వెళ్ళి పోయాడు నరసింగరావు.

ఛీత్కారభావంతో వెళ్ళిపోతున్న నరసింగరావుని ఆపే ప్రయత్నం చేయలేదు గంగులు. పెదవుల మీది చిరునవ్వును సడలించకుండానే—

జనంవైపు తిరిగి —

''పోరని మాట లటుంచండి, నే నొకటి చెప్త ... న్యాయం ఎటుందనిపిస్తే అటే వోటెయ్యండి! మనకు కావల్సింది మన కస్టాలు తెల్సుకొని మనకు ఆసరగుండే మనిసి! ఆ పని ఎవరివల్లైతే అయితదని మీకు భరోసా ఉందో గాయన కెయ్యున్రి మీ వోటు'' అని అక్కడి నుండి వెళ్ళిపోయాడు గంగులు ఇంటివైపు!

వెనకాలే రకరకాల వ్యాఖ్యలు చేసుకుంటూ జనం కదిలిపోయారు!

ఆ రోజు రాత్రి గంగులు ఇంట్లో—

''అయితే నీ వోటుఎవరికేస్తనంటవు?'' లచ్చి నడిగాడు గంగులు!

''నా వోటు, నా ఇష్టం — నే నెవరికైన ఏస్త. నడిమిట్ల నీ పెత్తన మేంది?'' లచ్చి నిర్లక్ష్యంగా అంది!

''వోరి నీయమ్మ ... కోపంల గొడ ఎంత రంజా గున్నవే?'' అంటూ లచ్చి పక్కన కుక్కి మంచంలోకి చేరాడు గంగులు!

లచ్చి గోడవైపు తిరిగి మాట్లాడకుండా పడు కుంది!

''నీ వోటు ... నీ ఇష్టమేగానీ, మన గూడెమో ల్లందరమూ ఒకరికే ఎయ్యాలె. ఆదీ నే నెప్పేడ్డి—''

''అంటే? నువ్వెవల కెయ్యమంటే వాల్ల కెయ్యాల్నంటవు— అంతేనా?'' అడిగింది లచ్చి!

''అవును మరి.'' ముక్తసరిగా జవాబిచ్చాడు గంగులు.

''మొన్న రామలింగం దొర మనింటికొచ్చి ...'' 'లచ్చమ్మా! నీ వోటు, గూడెంల కడ్మ ఆడోల్ల వోట్లు నాకే పడేట్లు సూడు' అన్నడు. అట్ల చేస్తే ... మన కందరికీ ఇండ్లు కట్టిపిస్త నన్నడు! పూరోల్ల సంగతి మనకేమిట్కి గాని ... మన చంద్రిగానికి బజార్ల చెప్పుల దుక్నం ఇప్పిస్త నన్నడు! ఇన్ని చేస్త నన్నోడ్ని ఇడ్సి నాయం, దర్మం అనుకుంటగా రంగన్న కేస్తే ఆయనేం జేస్తడు? ఆయన తాన ఉన్న రెండెకరాల తరి గూడ గూడెపోల్లకే ఇచ్చె! ఇగ అన్న నండే దేంది? మనం పంచుకునే దెంత? గా రంగన్న గూడ మన లెక్కనే పేదోడు గాదా!'' అంది లచ్చి.

''అవ్వే! రంగన్నా పేదోడు ... అందుకే ఆయ న్నే కంటితోని కనిపెట్టే ఉండా ల్నంటున్న!'' లచ్చిని తన వైపు తిప్పుకుంటూ అన్నాడు గంగులు!

• • • •

మర్నాడు మధ్యాహ్నానికి ఎన్నికల ఫలితాలు వెలు వడ్డాయి!

ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న గంగులు ఫలితాలు విని చెవులు మూసుకున్నాడు!

''రామలింగం దొరకూ జై!''

''రామలింగం సాబ్ జిందాబాద్!''

అంటూ ఉప్పెనలా ముందుకు సాగుతున్న జన వాహినిని చూసి గంగులుకి ఒంటి మీద తేళ్ళూ, పాములూ పాకినట్లయింది! రంగన్న ఒక్క వోటు తేడాతో పడిపోయాడన్న సంగతి పదే పదే మనసును కాల్చేస్తున్నది!

వెంటనే గబగబా గూడెంకేసి నడిచాడు!

ఆ సమయానికి బట్టలు ఉతుకుతున్న లచ్చి గంగుల్ని చూసి నవ్వుతూ—

''మన రామలింగం దొరనే గెల్సిండంట'' అంది!

కొరకొరలాడుతూ మవునంగా నిలుచుండి పోయాడు గంగులు!

''అట్ల నిలబడ్డవేందీ?'' అంది లచ్చి పని ఆపేసి!

''లచ్చీ! ఇమానం తోని చెప్పవే — నీ వోటు ఎవరి కేసినవు?'' అన్నాడు గంగులు, బిగించిన పిడికిల్ని వణికిస్తూ!

''దొరకే ఏస్తనంటని మొన్న రాత్రే సెప్తిగదనే మావా...'' అంది లచ్చి భయం భయంగా!

''ఎంత పని చేసినవే, లచ్చీ! గూడెపోల్లందరం రంగన్న కెయ్యాల్నంటని గదా అనుకున్నం! నీ ఒక్క వోటుతోని ఏమైందో సూడు?''

''నా వోటు నా ఇష్టమొచ్చినోల్లకు ఏసేది గొడ తప్పంటవా?''

''తప్పని ఏ గాడిదకొడు కంటడే? కానీ ... వోటంటే ఏమనుకున్నవు? దీపంబుడ్ల సమురు లాంటిది! సమురు మంచిదైతే ఎలుగు మంచి గుంటది! ఆ దీపం సానసేపు ఎలుగుతది! లేకుంటే మనకు మిగిలేడ్ది సీకటేనే, లచ్చీ! ఛీ ... ఛీ ... మల్ల ఐదేండ్ల దంక మనోల్లకు సిమ్మ సీకటి మిగిల్చి నవు!'' అని గంగులు విస విస వెళ్ళిపోయాడు.

చేతులతోపాటు లచ్చి మనసులో ఆలోచనలూ కదలాడ సాగాయి!

• • • •

ఋతుచక్రం తిరిగిపోతోంది!

గూడెం గూడెంగానే మిగిలింది!

ఎవరూ ఋణాన్నించి విముక్తి పొందలేదు!

ఎవరి పొలాలో తిరిగి రాలేదు!

చంద్రం చెప్పుల షాపు బస్టాండులో వెలుస్తుం దన్న లచ్చి రంగుల కల యథార్థమయ్యే ఘడియ కోసం చింతచెట్టు కింద ఎదురుచూస్తునే ఉన్నాడు గంగులు!

*